

ఘనంగా గిరి విజ్ఞాన సంబరాలు



విజ్ఞాన సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి -ముంచంగిపుట్టు : మండల కేంద్రంలోశ్రీ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర1 పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ స్థాయి గిరిజన విజ్ఞాన సంబరాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాణిక్యాలరావు మాట్లాడుతూ గిరిజన విజ్ఞాన సంబరాలలో భాగంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలురు 1,2 బాలికలు 1,2 జర్రెల, గుర్రాల బయలు జిపిఎస్ పాఠశాలలు, మొక్కపుట్టు, దారపల్లి, జంగంసరియ, జర్రెల మండల పరిషత్ పాఠశాలల విద్యార్థులు పాల్గొని, సైన్స్‌ఫెయిర్‌లో వివిధ నమూనాలతో తమ ప్రతిభను చూపారన్నారు. గిరిజన సాంస్కృతిక కార్యక్రమంలో దింసా నృత్యం, కోలాటం, డ్యాన్స్ తదితర కార్యక్రమాలు చేపట్టారు.

శిక్షణ కేంద్రాలతో గిరిజన యువతకు ఉపాధి

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి



శిక్షణ కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : శిక్షణకేంద్రాలతో యువతకు స్వయం ఉపాధి లభిస్తుందని, గిరిజన యువత దానిని సద్వినియోగం చేసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం పాడేరు గ్రామంలో ఐటిడిఎ ఆధ్వర్యంలో రూ. 50 లక్షల కేంద్ర ప్రత్యేక సహాయ నిధులతో నిర్మించనున్న శిక్షణా కేంద్రం భవన నిర్మాణానికి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, గిరిజన యువతకు స్వయంఉపాధి మార్గాలు చూపే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంతరం పని చేస్తున్నాయన్నారు. చాలామంది యువత అవకాశాలు అందిపుచ్చుకోలేని పరిస్థితి గత ప్రభుత్వాలు కల్పించాయని ఆరోపించారు. ఈ శిక్షణ కేంద్రం ద్వారా గిరిజన యువతకు భవిష్యత్తులో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ అభిషేక్, సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, ఎంపీపీ సోనారి రత్నకుమారి పాల్గొన్నారు

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

చోద్యం చూస్తున్న అధికారులు, నేతలు
తక్షణ చర్యలకు గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి -అరకులోయ రూరల్ : మండలంలోని బొండం పంచాయతీ పరిధి కొలియగూడ, కొత్తవలస, కరకవలస, రేగ, గ్రామాలను అనుకుని ఉన్న గెడ్డల నుంచి కొన్నాళ్లుగా నిత్యం ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో దారుణమని గిరిజన సంఘం మండల నాయకులు జి బుజ్జి బాబు, కె బుజ్జి బాబు అప్పన్న విమర్శించారు. సర్పంచ్



ఇసుక అక్రమ రవాణాను పరిశీలిస్తున్న గిరిజన సంఘ నేతలు



గెడ్డల నుంచి ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుక తరలింపు

అండదండల యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని, దీంతో ఈ అక్రమాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోందన్నారు. ప్రయివేటు వ్యక్తులతో సర్పంచ్ చేతులు కలిపి ఇసుక అక్రమ రవాణా అప్పగించడం ఎంతవరకు సమంజసమన్నారు. .పంచాయతీ, గ్రామసభ, పీసా కమిటీ సభ్యుల అనుమతుల్లేకుండా ఇసుక అక్రమ దందా సాగుతోందన్నారు..ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వాదాయానికి గండిపడకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు జోషి, బుజ్జి బాబు గ్రామస్థులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

భూ సమస్యలు సత్వర పరిష్కారం

- సబ్ కలెక్టర్ శుభం బన్సల్

ప్రజాశక్తి -అడ్డతీగల

భూ సమస్యలను సత్వరమే పరిష్కరించనున్నట్లు సబ్ కలెక్టర్ శుభం బన్సల్ అన్నారు. సోమవారం రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించారు. దీనికి విశేష స్పందన లభించింది. మండలంలోని వివిధ సమస్యల కోసం ప్రజల నుండి 22 అర్జీలు అందించారు. స్థానికంగా ఉన్న పలు భూ సమస్యలపై ఫిర్యాదు చేసిన అర్జీదారుల వెంట సబ్ కలెక్టర్ శుభం బన్సల్ ఆయా ప్రాంతాలకు వెళ్లి స్వయంగా పరిశీలించారు. అనంతరం స్థానిక తహశీల్దార్ శ్రీనివాసరావుతో కూడిన రెవిన్యూ సిబ్బందికి సూచిస్తూ అర్జీదారులు ఆరోపించిన భూములకు సంబంధించి రెవిన్యూ రికార్డుల ప్రకారం హక్కుదారులకు భూములను అప్పగించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములను కబ్జాదారుల నుండి స్వాధీనం చేసుకోవాలన్నారు. మండలంలోని పులి గోగులపాడు పంచాయతీ పరిధిలో వివాదంలో ఉన్న 8.8 ఎకరాలకు సంబంధించి రికార్డు నివేదికలను ఐదు రోజుల్లో తమ కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. స్థానిక గిరిజన యువకుడు చోళ కృష్ణారెడ్డి ఆరోపించిన మెయిన్ రోడ్‌లోని ఐఓబి బ్యాంక్ నిర్వహణ స్థలం, డి భీమవరం రోడ్డులో ఉన్న ఖాళీ స్థలం రికార్డులను పరిశీలనకు సమర్పించాలని, ప్రభుత్వ పోరంబోకు స్థలాలకు రక్షణ కల్పించాలని కోరారు. స్థానిక ఎమ్మార్వో కార్యాలయం పక్క ఉన్న వివాదాస్పద స్థలంపై రెవెన్యూ రికార్డుల ప్రకారం హక్కుదారులను గుర్తించి అప్పగించాలని సూచించారు అడ్డతీగల ఏకలవ్య ప్రభుత్వ పాఠశాలకు సంబంధించి నూతన భవనాలు నిర్మాణంలో ఉన్న కారణంగా ప్రస్తుతం మారేడుమిల్లి ఏకలవ్య పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న తమ పిల్లలు అసౌకర్యాల నడుమ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తల్లిదండ్రులు చెప్పారు. దీనికి స్పందించిన సబ్ కలెక్టర్ మారేడుమిల్లి వెళ్లి స్వయంగా పరిస్థితులు సమీక్షించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడ్డతీగల ఎంపీడీవో వెంకట్, సిడిపిఒ దీప్తి ,డిప్యూటీ తాసిల్దార్ తేజస్విని, వీఆర్వో బాలయ్య ,రెవిన్యూ ఇన్స్పెక్టర్ చిన్నబ్బాయి దొర, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దాతలు

ప్రజాశక్తి -డుంబ్రిగూడ: మండల కేంద్రంలోని ఐసిడిఎస్ ఆవరణలో సోమవారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. జెడ్‌పిటిసి చాటారి జానకమ్మ, తహశీల్దార్ షేక్ ముజీబ్, ఎంపిడిఒ నగేష్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ, అన్నిదానాల కంటే రక్తదానం గొప్పదన్నారు. ఈ సందర్భంగా రక్తదానానికి 35మంది పేర్లు నమోదు చేసుకోగా, 15మంది రక్తాన్నిచ్చారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శిరీష స్వయంగా రక్తదానం చేసి మహిళలను ప్రోత్సాహించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ వైస్‌చైర్మన్ ఎస్ గంగరాజు, డాక్టర్ అశ్వని, లోహితాస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రాజు, అప్పారావు, వెంకట్, కోఆర్డినేటర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం గాడి తప్పితే కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి పాడేరు : ప్రభుత్వ విద్యాసంస్థల్లో మధ్యాహ్న భోజన పథకం పక్కదారి పడితే కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. విద్యార్థులకు పెట్టవలసిన ఆహార పదార్థాలు బయట వ్యక్తులకు పెడితే ఉపేక్షించనన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు నియోజక వర్గానికి సంబంధించి ఐదు మండలాల సహాయ గిరిజన సంక్షేమాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో చేయకూడని పనులు, చేయవలసిన పనులపై ప్రధానోపాధ్యాయులకు సర్క్యులర్ జారీ చేయాలని ఎంఇఒలను, ఎటిడబ్ల్యూఒలను ఆదేశించారు. అధికారులు పాఠశాలల స్టోర్ రూంలను తనిఖీ చేయాలన్నారు. కాలం చెల్లిన నిత్యావసర సరుకులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలన్నారు. విద్యార్థులను ఇళ్ళకు తీసుకుని వెళ్లే తలిదండ్రులు నుంచి తామే బాధ్యత వహిస్తామని లేఖ తీసుకుని పిల్లలను పంపించాలని స్పష్టం చేసారు. పాఠశాలల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఒక ఇంక్రిమెంట్ కట్ చేయాలని ఆదేశించారు. అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలు, ప్రభుత్వ సంస్థలలో బినామి వ్యక్తులతో పనులు చేయిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయి అధికారులపై మూడవ వ్యక్తి ప్రభావం ఉండకూడదని, తప్పులు చేసిన తర్వాత సిఫార్సులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జగన్న విద్యాకానుక కిట్లు పంపిణీపై ఆరా తీసారు.

మన బడి, నాడు నేడు పనుల్లో జాప్యం వద్దు

మన బడి నాడు నేడు రెండవ దశ పనులలో జాప్యం చేయకుండా పనుల చేయాలని ఆదేశించారు. ఎస్ఎస్ఆర్ రేట్లతో సంబంధం లేకుండా స్థానిక ధరలకు నిర్మాణ సామగ్రి కొనుగోలు చేయాలని సూచించారు. పాడేరు నియోజకవర్గంలో పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదన్నారు. చింతపల్లి మండలంలో రూ.80 లక్షలు, జికె.వీధిలో రూ.55 లక్షలు, కొయ్యూరు రూ.21 లక్షలు, జి.మాడుగులలో రూ.1 కోటి నిధులు ఖర్చు చేయాల్సి ఉందని, రానున్న 15 రోజుల్లో వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీరు మరుగుదొడ్లు, వంటగదులు త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డిఇఒ డా.పి.రమేష్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండలరావు, ఇఇ విఆర్ఎం రాజు, డిఇ . అనుదీప్ పాల్గొన్నారు.

నాణ్యతగా తాగునీటి పథకాల నిర్మాణం

తాగునీటి పథకాల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో తాగునీటి పథకాల నిర్మాణాలలో ఎక్కడా సబ్ కాంట్రాక్టర్ ప్రమేయం ఉండకూడదని స్పష్టం చేశారు. మూడు నెలల్లో పనులు పూర్తి చేయకపోతే మళ్లీ టెండర్ పిలుస్తామన్నారు. మంజూరు చేసిన పనులు వారం రోజుల్లో ప్రారంభించాలని సూచించారు. పనులపై డిఇలు, ఎఇలకు అవగాహన ఉండాలని చేపట్టిన పనుల మేరకు ఎప్పటికప్పుడు బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ లీలాకృష్ణ పాల్గొన్నారు.

రంపచోడవరం డివిజన్‌కు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే నియామకం

ప్రజాశక్తి -రంపచోడవరం

రంపచోడవరం డివిజన్‌కు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేని రాష్ట్ర ప్రభుత్వం నియమించడం జరిగిందని రంపచోడవరం డివిజన్ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్ కె.దేవేంద్రుడు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రంపచోడవరం డివిజన్లోని ఇప్పటివరకు డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్ పని చేశారని, రాష్ట్ర ప్రభుత్వం సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతిపై నియమించినట్లు చెప్పారు. ఏజెన్సీలోని భూహక్కు భూరక్ష ప్రోగ్రాం ద్వారా ప్రభుత్వ భూములకు ప్రైవేట్ భూములకు రీసర్వే చేసి భూహక్కు పత్రాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేగా ఉద్యోగోన్నతి వచ్చినందుకు ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా జెండాలు



పెదబయలు సంతలో నడిరోడ్డులో వెలసిన స్థూపం

ప్రజాశక్తి- పెదబయలు : మండల కేంద్రమైన పెదబయలులో సోమవారం రాత్రికిరాత్రే నీలిరంగు జెండాలు, స్థూపం వెలిశాయి. మావోయిస్టుల పిఎల్‌జిఎ వారోత్సవాలు జరుగుతున్న సందర్భంలో పోలీసులు ముమ్మర గాలింపుచర్యలు చేపడుతున్న పరిస్థితుల్లో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు జెండాలు, స్థూపం ఏర్పాటు చేశారు. సోమవారం వారపుసంత కావడంతో తెల్లవారుజామున దీన్ని చూసిన స్థానికులు ఆశ్చర్యపోయారు. అందిన సమాచారం మేరకు స్థానిక పోలీసులు వెళ్లి దీన్ని పరిశీలించారు. శాంతిస్థూపం పేరిట వెలిసిన దీనిపై మావోయిస్టుల రక్తదాహానికి అసువులు బాసిన గిరిజన సోదరులకు జోహార్లు ఉంది.

పోలీసులు, స్థానికులు వెళ్లి స్థూపాన్ని తెరచి పరిశీలించగా అందులో మావోయిస్టుల చేతిలో అత్యంత కిరాతకంగా చంపబడి, వీధినపడ్డ అనేక కుటంబాలకు సంబంధించిన సమాచారం అందులో ఉంది. గిరిజనాభివృద్ధికి ఆటంకం కలిగించే మావోయిజం వద్దని, నరరూప రాక్షసులను ఈ ప్రాంతంలో అడుగుపెట్టనీయ వద్దని అంటూ నినాదాలు ఉన్నాయి.

'సత్యసాయి' కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి


ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వర్లు



ఐటిడిఎ పిఒకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ ఐవి. సత్యసాయి కార్మికులు

ప్రజాశక్తి - రంపచోడవరం

5 మండలాల్లో గిరిజనులకు మంచి నీరు అందించే సత్య సాయి వాటర్ స్కీమ్‌లో పని చేస్తున్న కార్మికులకు తక్షణమే బకాయి జీతాలు చెల్లించాలని ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. 10 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ ఐటిడిఎ ఎదుట చేస్తున్న ఆందోళన శిబిరాన్ని సోమవారం ఎమ్మెల్సీ ఐవి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టరు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, ఐటీడీఎ అధికారులు నిర్లక్ష్యం ఫలితంగా వేతనాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని కోరారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చిరు కార్మికుల పరిస్థితులు దారుణంగా ఉందన్నారు. లోపాలు వున్న కాంట్రాక్టర్‌కు ఎలా టెండర్ ఇచ్చారని ప్రశ్నించారు. కేవలం కమీషన్లకు కక్కుర్తి పడి టెండర్లు ఇవ్వడం వల్ల కార్మికులు జీతాలు లేక వారి కుటుంబాలు అర్థాకలితో అలమటించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 12 రోజులుగా కార్మికులు దీక్షలు చేస్తున్నా స్పందించక పోవడం దుర్మార్గమన్నారు. అనంతరం ఐటీడీఎ పివో సూరజ్ గనోరేతో కార్మికులను తీసుకుని వెళ్లి మాట్లాడారు. జడ్పీ సీఈఓతో కూడా మాట్లాడారు. అనంతరం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వై.విల్సన్ బాబు, జిల్లా కమిటీ సభ్యులు సూరిబాబు, మండల అధ్యక్షులు సనాతన బాబు, మండల ప్రధాన కార్యదర్శి వెంగలరావు, కార్యదర్శులు టాస్టెల్ బాబు, అనిల్ బాబు తదితరులు ఎమ్మెల్సీ ఐవి చేతుల మీదుగా రూ.6,870 కార్మికుల దీక్ష శిబిరానికి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వాణిశ్రీ, ప్రధాన కార్యదర్శి వెంకట్, సత్యసాయి కార్మికులు పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

సమస్యలపై మిడ్డేమీల్స్ కార్మికుల వినతి

ప్రజాశక్తి-కొయ్యూరు

తమ సమస్యలను పరిష్కరించాలని మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన సోమవారం ఎంఇఒ కార్యాలయ డేటా ఎంట్రీ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు వై.అప్పలనాయుడు, ఎస్ సూరిబాబు మాట్లాడుతూ మిడ్డేమీల్స్ పథకంలో పనిచేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించి కనీసవేతనాలు ఇవ్వాలని, 5వ తేదీ లోపు వేతనాలు, బిల్లులు చెల్లించాలని, మెనూ ఛార్జీలు రోజుకు రూ.20కు పెంచాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. మార్చిన మెనూలో హాట్ పొంగలి, సాంబార్ బాత్, తొలగించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చెయ్యాలి, వంట షెడ్లు, వాటర్, కనీస సదుపాయాలు కల్పించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పింఛను ఇవ్వాలని, యూనిఫామ్ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిడ్డేమీల్స్ కార్మికులు మేడా కన్నయ్యమ్మ, పాంగి రమణమ్మ పాల్గొన్నారు.

1500 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-కొయ్యూరు

జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు, ఆపరేషన్ పరివర్తనలో భాగంగా, సోమవారం కొయ్యూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆడాకుల గ్రామ శివారులలో నాటుసారా స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 1,500 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామని ఎస్సై రాజారావు తెలిపారు. ముందస్తు సమాచారంతో, తమ సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసుతో కలిసి, దాడులు నిర్వహించి, బెల్లం పులుపుతో పాటు తయారీ సామాగ్రిని ధ్వంసం చేశామని ఎస్సై చెప్పారు.



పట్టుబడిన బెల్లం పులుపు

పరిహారం చెల్లించి పనులు చేపట్టండి

సిపిఎం ఆధ్వర్యాన నిర్వాసిత రైతుల ధర్నా, వినతి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు, నిర్వాసిత గిరిజన రైతులు

ప్రజాశక్తి- అనంతగిరి : కేకే లైన్ విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలని సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం నేత నాగులు మాట్లాడుతూ, కెకె.లైన్ విస్తరణలో భాగంగా శివలింగపురం, టైడా, సిమిడిపల్లి, బొర్రా, కరకవలస రైలు మార్గంలో భూములు నష్టపోతున్న రైతులకు పరిహారం చెల్లించిన తర్వాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తోకూరు సర్పంచ్ కిల్లో మొస్య, రైతులు పి.లక్ష్మణ, లక్ష్మణరావు పాల్గొన్నారు

రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన ఇంటింటికి రేషన్, వీధి వీధికి పరిమితమైపోగా, వ్యాన్‌లో రేషన్ సరుకుల పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని సిటీ జన్ రైట్స్ అవగాహన సేవా సంఘం జిల్లా అధ్యక్షులు శివ నాయక్ ఆరోపించారు. జిల్లా కేంద్రం పాడేరులో సోమవారం రేషన్ సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తూకంలో కోతలు విధిస్తున్నారని, కార్డుకు అరకిలో బియ్యం తగ్గిస్తున్నారన్నారు.దీనిపై జెసిసి డిఎం, తహశీల్దార్‌లను కలిసి ఫిర్యాదు చేశామన్నారు.



బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న శివ నాయక్,

'ఉపాధి' బకాయిలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి మారేడుమిల్లి

ఉపాధి కూలీలకు మూడు నెలల నుండి బకాయి ఉన్న వేతనాలు చెల్లించాలని కోరుతూ సోమవారం గిరిజన సంఘం ఆధ్వర్యాన ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ వీర కిశోర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనికి ముందు మండలంలోని ప్రధాన కూడలి నుంచి ఎంపిడిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, ఉపాధ్యక్షులు పులి సంతోష్ మాట్లాడుతూ బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, ఉపాధి కూలీలకు రోజు కూలి రూ.600 ఇవ్వాలని, ప్రతి గ్రామంలో పనిని గుర్తించాలని, తట్ట బుట్ట గడ్డపారలకు ఛార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వారానికి ఒకసారి పేమెంట్స్ చెల్లించాలని, కూలీల పే స్లిప్పులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు తీగల శ్రీనివాస్, మారేడుమిల్లి మండల అధ్యక్షులు ధర్మారెడ్డి, సర్పంచ్ మల్లీశ్వరి, ఈతపల్లి సత్యనారాయణ, వెంకట లక్ష్మి, గంగిరెడ్డి ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న గిరిజన సంఘం నాయకులు, ఉపాధి కూలీలు

అల్లూరి విగ్రహం ఏర్పాటుకు స్థలం ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి -సీలేరు : ఒడిశాలోని మల్కనగిరి జిల్లా కేంద్రంలో అల్లూరి సీతారామరాజు విగ్రహం ఏర్పాటు చేయడానికి స్థలం మంజూరు చేయాలని మల్కనగిరి శాసనసభ్యులు ఆదిత్య మాడిని కోరినట్లు భారత ఆదివాసీ ఎపి రాష్ట్ర అధ్యక్షులు గడుతురి రామ్ గోపాల్ ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు సోమవారం మల్కనగిరి జిల్లా శాసనసభ్యులు ఆదిత్య మాడిని కలిశారు. స్వాతంత్ర పోరాట సమయంలో అల్లూరి సీతారామరాజు నేతృత్వంలో కోయ, గిరిజన, ప్రజలు బ్రిటిష్ సామ్రాజ్యవాదులపై పోరాటం చేశారని గుర్తు చేశారు. గిరిజన స్వాతంత్ర్య పోరాట యోధులు బంగారుదేవి, కారం తమన్న దొర, సాహిద్ లక్ష్మణ్ నాయక్‌ను భావితరాలు గుర్తుంచుకునేలా వారి పేర్లు ప్రభుత్వ నిర్మాణాలపై లిఖించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా మల్కన్‌గిరి జిల్లా శాసనసభ్యులు ఆదిత్య మాడి సానుకూలంగా స్పందించారని రామ్ గోపాల్ వెల్లడించారు.



వినతిపత్రం ఇస్తున్న రామ్ గోపాల్



చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న సూరిబాబు

మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాడేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, సభ్యులతో కూడిన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం అట్టహాసంగా జరిగింది. స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సమక్షంలో చైర్మన్‌గా కుజ్జలి పంచాయతీ సర్పంచ్ కూతంగి సూరిబాబు, ఇతర సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మార్కెట్ యార్డును అన్ని విధాలుగా అభివద్ధి చేయాల్సిన బాధ్యత పాలకవర్గం మీద ఉందన్నారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.కార్యక్రమంలో ఎపి మెడికల్ కౌన్సిల్ మెంబర్ డా.టి.నర్సింగరావు, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ సరస్వతి, వైస్ ఎంపిపి కనకలమ్మ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గబ్బడ రాజారావు, సర్పంచ్ లు ఎస్.రాంబాబు, వి.రాంబాబు, సన్నిబాబు, చిట్టిబాబు, సుశీల, చిట్టమ్మ పాల్గొన్నారు.

డిడిఒలదే ఆదాయ పన్ను రికవరీ బాధ్యత



డిటిఒ ప్రసాద్‌బాబు

ప్రజాశక్తి -పాడేరు: ప్రతి నెలా జీతం బిల్లులలో ఆదాయపు పన్ను తగ్గింపులు చేయాల్సిన పూర్తి బాధ్యత డిడిఒలదేనని జిల్లా ఖజానాధికారి ఆర్. ప్రసాద్‌బాబు అన్నారు. సోమవారం కలక్టరేట్ సమావేశ మందిరంలో డిడిఒలతో నిర్వహించిన సమావేశంలోమాట్లాడుతూ, ట్యాన్ రిజిస్ట్రేషన్ చేయించుకొని సిబ్బంది జీతభత్యాల నుండి ఆదాయపు పన్ను రికవరీ చేయవచ్చన్నారు. ప్రభుత్వ క్వార్టర్‌లో అద్దెకు ఉంటే హెచ్‌ఆర్‌ఏ ఇవ్వకూడదనానరు.. ఇన్‌కమ్ టాక్స్ రికవరీకు సంబంధించి రూ. 1.50లక్షల సేవింగ్స్ ఉంచుకోవచ్చని, రూ.50వేలు వరకు స్టాండర్డ్ డిడక్షన్ ఉంటుందని తెలిపారు. రూ. 2.50లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకు ఐదు శాతం, రూ.ఐదు లక్షల నుంచి రూ.పది లక్షల వరకు 10శాతం, రూ. పది లక్షలు దాటినవారికి 30శాతం రికవరీ చేయాలన్నారు. రిఫండ్స్‌ను డిడిఒలు తప్పనిసరిగా చెక్ చేయాలన్నారు. ట్రెజరీ సిబ్బందికి కూడా పరిశీలించాల్సిన బాధ్యత ఉందన్నారు. బిన్ నెంబరు చెక్ చేసుకుంటే తప్పనిసరిగా ఇన్ కమ్ టాక్స్ క్రెడిట్ అవుతుందో లేదో తెలుస్తుందన్నారు. హౌసింగ్ లోన్స్ తీసుకుంటే తప్పనిసరిగా బ్యాంకు ద్వారా వడ్డీ సర్టిఫికేట్, ఇన్‌కమ్ టాక్స్ రికవరీలో పొందుపరచాలన్నారు.

7న ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్‌తో సమావేశం



కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి పాడేరు: ఈ నెల 7న ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ వి.బాబు అధ్యక్షతన ప్రస్తుత ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహిస్తారని జిల్లా కలక్టరు సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం జిల్లాలకు ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్‌గా బాబును భారత ఎన్నికల కమిషన్ నియమించిందన్నారు. సమావేశానికి అరకు ఎంపీ జి. మాధవి, అరకు, పాడేరు, రంపచోడవరం శాసన సభ్యులు చెట్టి ఫాల్గుణ, కె. భాగ్యలక్ష్మి, ఎన్. ధనలక్ష్మి, అన్నిపార్టీల ప్రతినిధులను ఆహ్వానించామన్నారు.

మండల సభలో సమస్యల ఏకరువు

ప్రజాశక్తి - ముంచింగిపుట్టు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపిటిసిలు, సర్పంచ్‌లు సమస్యలపై ఏకరువు పెట్టారు. ఎంపిపి అరిసెల సీతమ్మ అధ్యక్షతన ఎంపిడిఒ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో వివిధ శాఖల అధికారులు అజెండా ప్రకారం నివేదికలు వినిపించారు. విద్యాశాఖపై జరిగిన చర్చలో రంగబయలు పంచాయతీ పరిధిలో నాలుగు పాఠశాలలకు భవనాలు, ఉపాధ్యాయులు లేరని సర్పంచ్ ధనియా విన్నవించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల విధినిర్వహణ, సమయపాలనపై లక్ష్మీపురం, వనబసింగీ, కిలగడ, కించాయి పుట్టు పంచాయతీ సర్పంచులు ఎంఇఒను ప్రశ్నించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఇతరుల ప్రవేశాలకు ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పలువురు విద్యార్థులు అనారోగ్యాలతో మృత్యువాత పడుతున్నా, జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒలు స్పందించపోవడంపై పలువుఉఉ మండిపడ్డారు. పాఠశాలల్లో రెండో విడత నాడునేడు పనుల్లో నాణ్యత, జాప్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆరోగ్య శాఖపై జరిగిన చర్చలో వైద్యులు, సిబ్బంది ఖాళీలను భర్తీచేసి, వైద్యసేవలను మెరుగుపరచాలని, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు భోజన సదుపాయాలు కల్పించాలని కోరారు. వ్యవసాయ శాఖపై జరిగిన చర్చలో ప్రభుత్వం సరఫరా విత్తనాలతో రైతులకు



మండల సభలో సమస్యలపై నిలదీస్తున్న సభ్యులు

మంచిదిగుబడులు వచ్చాయని వ్యవసాయ శాఖాధికారి మోహనరావు తెలిపారు.అధిక కరెంటు బిల్లులపై సభ్యులు ప్రశ్నించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల సమస్యలపై తక్షణం స్పందించి పరిష్కరిస్తామనివిద్యుత్ శాఖ అధికారులు భరోసానిచ్చారు. గృహనిర్మాణంలో జాప్యం నివారణకు ఎంపిడిఒ, తహశీల్దార్ పర్యవేక్షణ చేయాలని వనుగుమ్మ, రంగబయలు పంచాయతీ ప్రజల తరపున సంబంధిత సభ్యులు ఎంపిడిఒకు వినతిపత్రం అందించారు. విద్యుత్ బిల్లులు తగ్గించాలని సభ్యులు విన్నవించి, ఎంపిడిఒకు అర్జీలిచ్చారు.

మొరాయిస్తున్న బిఎస్‌ఎన్ఎల్ సెల్ సిగ్నల్స్

అవస్థలు పడుతున్న వినియోగదారులు

ప్రజాశక్తి- పెదబయలు: మండల కేంద్రంలో బిఎస్‌ఎన్ఎల్ సిగ్నల్‌కు తరచూ అంతరాయంతో ప్రభుత్వ ప్రైవేటు వాణిజ్య కార్యకలాపాలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గడచిన వారం రోజులుగా వచ్చిపోతున్న బిఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ సోమవారం పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో జియో సేవలపై ఆధారపడాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. బిఎస్ఎన్ఎల్ కనెక్షన్లు పెట్టుకుని, వాటిని రీఛార్జి చేయించుకుని, మళ్లీ వేరే నెట్‌వర్క్‌కు సంబంధించిన సేవలు వాడుకోవాల్సి రావడం, రెండింటికీ కలిసి రీఛార్జింగ్ తడిసి మోపెడౌతోందని వినియోగదారులు వాపోతున్నారు. దీనిపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా వారు స్పందించడం లేదని, దీంతో బిఎస్ఎన్ఎల్ కనెక్షన్లు ఉంచుకోవాలా? లేకుంటే వేరు నెట్‌వర్క్‌కు మారిపోవాలా అని ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి, బిఎస్ఎన్ఎల్ సిగ్నల్స్‌ను అందుబాటులోకి తెచ్చే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వైసిపి హయాంలో బిసిలకు అన్యాయం

టిడిపి ఆధ్వర్యాన ధర్నా.. తహశీల్దార్ కార్యాలయంలో వినతి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: రాష్ట్ర జనాభాలో 58 శాతానికి పైగా ఉన్న వెనుకబడిన తరగతులను వైసిపి ప్రభుత్వం, సిఎం జగన్ మోహన్ రెడ్డి అణచివేస్తున్నారని టిడిపి బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలుపర్తి గోవిందరావు ఆరోపించారు. టిడిపి అధినేత చంద్రబాబు పిలుపు మేరకు అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో గోవిందరావు ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణకు అందజేశారు. కార్యక్రమంలో బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రొబ్బి రాము, బొడ్డేటి వరలక్ష్మి, బుద్ధ జ్యోతికిరణ్, వియ్యపు వెంకట్, గంగ్రడ్డి ఈశ్వరరావు, వియ్యపు నాగేంద్ర, పాల్గొన్నారు.

20 మందికి వ్యాసెక్టమీ ఆపరేషన్లు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం 20 మందికి వ్యాసెక్టమీ కుటుంబ నియంత్రణ చికిత్సలు నిర్వహించినట్లు ఎడిఎంహెచ్‌ఒ డా.కె.లీలాప్రసాద్ తెలిపారు. చికిత్స అనంతరం పిహెచ్‌సిలో మాట్లాడుతూ, కుటుంబనియంత్రణ ఆపరేషన్ చేసిన పురుషులను పిహెచ్‌సి అంబులెన్స్‌లో స్వగ్రామాలకు సురక్షితంగా చేర్చామన్నారు. పాడేరు గిరిజన ప్రాంతంలోని పిహెచ్‌సిల పరిధి గ్రామాలలో వ్యాసెక్టమి (మగ) కుటుంబ నియంత్రణ ఆపరేషన్లపై అవగాహన పెరగడం అభినందనీయమని, ఆసక్తి ఉన్నవారు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఐఒ డా.ప్రభావతి, పిహెచ్ సి వైద్యాధికారి డా.వి ప్రవీణ్ కుమార్, గోపాలకష్ణ, డా.రాణాప్రతాప్, ఆరోగ్య విస్తరణ అధికారి సింహాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో బంగారు పతకాలు

ప్రజాశక్తి- పిఎం పాలెం : జెఎన్‌టియు కాకినాడ విశ్వవిద్యాలయలో ఈ నెల 2, 3 తేదీలలో నిర్వహించిన అంతర కళాశాల అథ్లెటిక్ పోటీలలో కొమ్మాది చైతన్య కళాశాల బి.టెక్ మెకానికల్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి చెల్ల సురేష్ రెండు బంగారు పతకాలు సాధించాడు. 5, 15 కిలో మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ నెల 1వ తేదీన జెఎన్‌టియు విజయనగరం విశ్వ విద్యాలయంలో నిర్వహించిన చదరంగం పోటీలలో బి.టెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థి జె.నిఖిలేష్‌రెడ్డి ప్రథమ స్థానం సాధించి ఫిబ్రవరి నెలలో జరిగే అంతర్ విశ్వ విద్యాలయ పోటీలలో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరు విద్యార్థులను చైతన్య కళాశాల ఫైనాన్స్ డైరెక్టర్ పి.మాధవి, ప్రిన్సిపల్ కె.సురేష్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పార్వతి, పీడీ పి.వేణుగోపాల్, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

వికలాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి- ఆనందపురం : వికలాంగ విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగపరచుకొని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని భీమిలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం బహుమతులు అందించారు. కొందరికి వీల్ చైర్లు పంపిణీ చేశారు. మండల విద్యాశాఖాధికారి ఎస్ఎస్.పద్మావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైసిపి నాయకులు మజ్జి వెంకటరావు, పాంద్రంకి శ్రీను, బిఆర్‌బి నాయుడు, బోట్ట రామకృష్ణ, లంక రాంబాబు, అప్పలస్వామి నాయుడు, ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, నాగమణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మిస్ టీన్ సూపర్ గ్లోబ్ విజేత నందనకు అభినందన

ప్రజాశక్తి - ఆరిలోవ : అంతర్జాతీయ అందాల పోటీల్లో మిస్ టీన్ సూపర్ గ్లోబ్ 2022 విజేతగా నిలిచి భారతదేశానికి కిరీటాన్ని తీసుకొచ్చిన విశాఖ వ్యాలీ స్కూలులో పదో తరగతి చదువుతున్న బాలిక తేజు నందనను మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సోమవారం అభినందించారు. వివిధ దేశాల నుంచి 40 మంది పాల్గొనగా తేజు నందన మూడవ విన్నర్ టైటిల్ సొంతం చేసుకున్నారు. పెదగదిలిలోని క్యాంపు కార్యాలయంలో తేజు నందన మేయర్‌ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా తేజు నందనను మేయర్ సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బోని శ్రీనివాసరావు, కోడిబోయిన బంగారాజు, తేజు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'చిట్టివలస' భూముల అమ్మకం చెల్లదు

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జ్యూట్ మిల్లు యాజమాన్యం భూములను అమ్మే ప్రయత్నం చేయడం చట్ట రీత్యా చెల్లదని చిట్టివలస జ్యూట్ మిల్లు లాకౌట్ బాధిత సంఘం కార్యవర్గ సభ్యులు ఎన్.అప్పలరాజు, విఎస్ఎ.నరసింహారాజు, సింగిడి అప్పారావు, జీరు వెంకటరమణ, పాసల శివ తెలిపారు. ఇదే అంశంపై జిల్లా కలెక్టర్, జాయింట్ లేబర్ కమిషనర్‌కు సోమవారం వినతి పత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. పలు అంశాలపై ఇప్పటికే తమ సంఘం జ్యూట్ యాజమాన్యంపై కోర్టులో కేసులు వేసినట్లు తెలిపారు. విచారణలో ఉంటుండగానే యాజమాన్యం భూములను అమ్మే ప్రయత్నం చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఇప్పటికే కొన్ని భూములను యాజమాన్యం అమ్మకానికి పెట్టినట్లు తమ సంఘం దృష్టికి వచ్చిందని తెలిపారు. యాజమాన్యం దుందుడుకు చర్యలను అడ్డుకోవాలని వినతి పత్రంలో కోరారు.

ల్యాండ్ సర్వే సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 'ల్యాండ్ సర్వే' సర్టిఫికెట్ కోర్సు చేయుటకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనీస అర్హత 10వ తరగతి పాసైనా, ఫెయిల్ అయినా సంబంధిత కోర్సులో ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు. ఇందునిమిత్తం రూ.6 వేలు ఫీజు చెల్లించాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 12 వ తేదీలోపు కళాశాల ప్రిన్సిపల్ కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సిపిఐ నాయకులు

గృహ నిర్మాణాలకు రూ.5 లక్షలు ఇవ్వాలి

ప్రజాశక్తి - సీలేరు : పిఎంఎవైజి, వైయస్సార్ గృహ పథకం కింద ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులకు రూ.5 లక్షల చొప్పున మంజూరు చేయాలని సిపిఐ నాయకులు కంకిపాటి సత్తిబాబు, రాజాబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిపిఐ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించి, తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్సార్ గృహాలకు ప్రస్తుతం ఇస్తున్న రూ.1.80 లక్షలు సరిపోవడం లేదని, ఆ మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు ఇస్తామని ఎన్నికల సమయంలో చెప్పిన జగన్మోహన్ రెడ్డి, ఆ హామీ అమలు కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.78 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.72వేలు, ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా రూ.18వేలు, మరుగుదొడ్లకు రూ.12వేలు ఇస్తామని చెబుతున్నారని, కాని ప్రస్తుత ధరలతో ఈ సాయం సరిపోదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సుంకర విష్ణుమూర్తి, కవర్ల భగవాన్, దేశగిరి, కృష్ణ, ఇంగువ రామారావు, శ్రీరామ్ జోగిరాజు, దేవుడు, ఎర్రయ్య లబ్ధిదారులు పాల్గొన్నారు.

అల్లూరి యువ గిరిజన సంఘం ఆధ్వర్యాన సేవలు

ప్రజాశక్తి-కొయ్యూరు : అల్లూరి యువ గిరిజన సేవా సంఘం సభ్యులు నిరంతరం సేవా కార్యక్రమాలు అందిస్తున్నట్లు సంఘం అధ్యక్షులు టి.మల్లేష్ తెలిపారు. మండలంలోని గదబపాలెం పంచాయతీ మల్లవరం గ్రామంలో అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న ఒక కుటుంబానికి ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. రక్తదాన శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పి.సన్యాసిరావు, పి.చిట్టియ్య, పి. నూకరాజు, ఎన్. చెల్లయ్య, టి.యువీ, కె.పొల్లయ్య, కె.నాగరాజు, అచ్చిరాజు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

స్పందనకు 60 వినతులు

ప్రజాశక్తి - రంపచోడవరం : స్థానిక ఐటిడిఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 60 దరఖాస్తులు అందాయి. ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, ఎపిఓ సిహెచ్. శ్రీనివాసరావు స్పందనలో దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధించిన సమస్యలపై దరఖాస్తులు ఎక్కువగా వచ్చినట్లు చెప్పారు. వ్యక్తిగతానికి సంబంధించిన సమస్యలు కొన్నింటగిని వెంటనే పరిష్కరించి, మరి కొన్ని సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషించి పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజు, ఎండి యూసఫ్, నాగేశ్వరరావు, వెలుగు ఏపిడి ఎ.శ్రీనివాసరావు, డిఎల్‌డిఒ కె.కోటేశ్వరరావు. ఐటీడీఏ పరిపాలన అధికారి డిఎన్‌వి.రమణ, ఎస్ఓ వి.కబోది. ఎడిఎంహెచ్ఒ డాక్టర్ అనూష పాల్గొన్నారు.

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దని ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

బోయ/వాల్మీకి సహా ఇతర కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దని, తక్షణం జిఒ నెంబర్ 52ను రద్దు చేయాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర చైర్మన్ చక్రి నాయక్ డిమాండ్ చేశారు. బోయ/వాల్మీకి కులాలను గిరిజన జాబితాలోకి చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సంఘం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరినైనా ఎస్‌టిలుగా పరిగణించాలంటే వారు కొండ ప్రాంతంలో ఉండాలని, వారికి ప్రత్యేకమైన భాష ఉండాలని తెలిపారు. రాజకీయ స్వలాభం కోసం కొత్తవారిని ఎస్‌టి జాబితాలో చేర్చాలని చూడటం తగదన్నారు. మైదాన ప్రాంతంలో ఉన్నవారు ఆర్థికంగా ఇప్పటికే అభివృద్ధి చెంది ఉన్నారని, వారిని ఎస్‌టి జాబితాలోకి చేరిస్తే అన్ని విధాలా వారే ఎదుగుతారని అన్నారు. ప్రభుత్వం పునరాలోచించి జీవో నెంబర్ 52ను రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోరాబు సత్యనారాయణ, రుడా సత్యారావు



ధర్నా చేస్తున్న గిరిజన ఉద్యోగులు

మాట్లాడుతూ ఇతర కులాలను గిరిజన జాబితాలో చేర్చడం వల్ల అసలైన గిరిజనులకు జరిగే నష్టం అంతా ఇంతా కాదన్నారు. అడవులను, గనులను బడాబాబులకు, బహుళ జాతి సంస్థలకు ధారాదత్తం చేయడం కోసం ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పని చేసే వారికి

కమీషన్ రూ.87 లక్షలు చెల్లించాలి

ప్రజాశక్తి -చింతూరు

విలీన మండల వెలుగు ఐకెపి ద్వారా వరి ధాన్యం కొనుగోలు చేసిన ఆరు కేంద్రాల్లోని 36 మందికి చెల్లించాల్సిన రూ.87 లక్షల కమీషన్ తక్షణమే చెల్లించాలని ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం చింతూరు పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీ ఐవి దృష్టికి బాధితులు సోడే రాములమ్మ, పాయం ఈశ్వరి, సోడె సుక్కమ్మ, కమిటీ సభ్యులు తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్సీ ఆధ్వర్యాన ఐటిడిఎ పిఒ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఆయన ఐకెపి, పౌరసరఫరాల అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఐవి మాట్లాడుతూ 6 కేంద్రాలలో మహిళలు గ్రూప్ సభ్యులు అంతా ధాన్యంను సేకరించి వాటిని మిల్లర్లకు అమ్మే వరకు ఎలాంటి వర్షం గాలి దుమ్ములకు నష్టం జరగకుండా మార్కెట్‌కు శ్రమ చేస్తున్న వారికి కమీషన్లు నాలుగేళ్లగా ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సోడే రాములమ్మ పాయం, ఈశ్వరి,



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ ఐవి, మహిళలు

సోడే సుక్కమ్మ. కారం కనకదుర్గ, సోడ నరమ్మ, చింతల ముత్తమ్మ. మడకం రాజమ్మ అగరం పెంటమ్మ, బీరబోయిన లక్ష్మి, కథల బాయమ్మ, పూనమ్ జయమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ ఛాతి, అంటువ్యాధుల ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు బకాయి ఉన్న నాలుగు నెలల జీతాలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ప్రభుత్వ ఛాతి, అంటువ్యాధుల ఆసుపత్రి శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు పి.వెంకటరావు మీడియాతో మాట్లాడుతూ కృష్ణా కనస్ట్రక్షన్ కాంట్రాక్టర్ నుంచి ఆగష్టు, సెప్టెంబరు, అక్టోబర్, నవంబరు నెలల జీతాలు బకాయి పడ్డాయన్నారు. పలుసార్లు విన్నవించినా కాంట్రాక్టర్ స్పందించలేదన్నారు. కలెక్టర్ స్పందించి బకాయి జీతాలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కనీస వేతనం చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కాంట్రాక్టరు నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సోమవారం నుంచి సమ్మెకు దిగుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు పి.పోతురాజు, కార్యదర్శి వి.కేశవ పాల్గొన్నారు.



పిఒ సూరజ్ గనోరేతో క్రీడాకారులు

క్రీడాకారులకు పోత్సాహం

ప్రజాశక్తి - రంపచోడవరం : క్రీడలపై శ్రద్ధ ఉన్న యువతి యువకులను ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో జరిగిన వివిధ రకాలైన క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ప్రాజెక్ట్ అధికారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పిఒ సూరజ్ గనోరే మాట్లాడుతూ జగనన్న క్రీడా సంబరాలు సందర్భంగా రంపచోడవరం డివిజన్ నుండి కొంతమందిని పంపించినట్లు చెప్పారు. కబాడీలో ప్రథమ బహుమతి, వాలీబాల్‌లో ద్వితీయ బహుమతి, క్రికెట్‌లో ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. ఇక్కడ గెలుపొందిన టీములు జోనల్ పోటీలకు విజయనగరం. విశాఖపట్నం. శ్రీకాకుళం జిల్లాలలో క్రీడల పోటీలకు వెళ్లవలసి ఉంటుందన్నారు. ఫిజికల్ డైరెక్టర్లు కె.పోతురాజు, కె.కిషోర్, జి.ఆటోని మంచి శిక్షణ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిడి సిహెచ్ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ బి.కిషోర్, ఫిజికల్ డైరెక్టర్లు పోతురాజు. కిషోర్. ఆంటోనీ తదితరులు పాల్గొన్నారు,

ఏకలవ్య పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- చింతూరు : చింతూరు మండలం లక్కవరం గ్రామంలో నిర్మాణంలో వున్న మోడల్ ఏకలవ్య పాఠశాలను ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల శాసన మండలి సభ్యులు ఐ.వెంకటేశ్వరరావు సోమవారం సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదులు, హాస్టల్ గదులు, కిచెన్‌ను, టాయిలెట్స్, ఆఫీస్ రూమ్స్, ల్యాబ్ రూమ్‌లను ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం గుత్తేదారుతో మాట్లాడి పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఎమ్మెల్సీ వెంట సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ తదితరులున్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు

ప్రజాశక్తి - చింతూరు : చింతూరు డివిజన్లోని ఏడుగు రాళ్లపల్లి గ్రామంలో సోమవారం మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి. ఈనెల 2 నుంచి 8వ తేదీ వరకు వారోత్సవాలకు మావోయిస్టులు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో ఈ పోస్టర్లు ఏర్పాటు చేశారు.

పంటల మద్దతు ధర చట్టం కోసం వినతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కేంద్రం పంటల మద్దతు ధర చట్టం చేసేలా ఒత్తిడి తేవాలని విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ కార్యాలయంలో రైతు సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. రైతు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో రైతాంగం పోరాటం చేపట్టినప్పుడు లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను కేంద్రం అమలు జరపాలన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని, సోమనాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్కరణల చట్టం సవరణ ఆపాలన్నారు. రైతుల పోరాట కాలంలో అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు. ఉత్తరప్రదేశ్ రైతులపై దౌర్జన్యంగా కారు నడిపి రైతులు, విలేకరి మరణానికి కారణమైన యుపి రాష్ట్ర మంత్రి కుమారునిపై చర్యలు తీసుకోవాలన్నారు. పై విషయాలపై రాష్ట్రపతి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఎంపీ ఎంవివి.సత్యనారాయణను కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం విజయనగరం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్, అనకాపల్లి జిల్లా కోశాధికారి గండి నాయన బాబు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 29 ఫిర్యాదులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రతి సోమవారం జరిగే పోలీసు స్పందనకు ఈసారి 29 ఫిర్యాదులు వచ్చాయి. ఎస్‌సి, ఎస్‌టి సెల్ ఏసిపి ఎస్.బాపూజీ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో బాధితుల నుంచి వీటిని స్వీకరించారు. సిటీ పోలీసు కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ బాధితులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.